క్లుప్తంగా

తాళభద్ర రైల్వేగేటు వద్ద అండర్ పాసేజ్

పలాస: కాశీబుగ్గ నుంచి అక్కుపల్లి వెళ్లే రోడ్డులో తాళభద్ర రైల్వే గేటు వద్ద అండర్ పాసేజ్ మంజూరైనట్టు ఖుర్దా రైల్వే డివిజన్ సివిల్ ఇంజినీరు, సీనియర్ సర్వేయరు చింతామణి చెప్పారు. శుక్రవారం, శనివారాల్లో వారు సర్వే చేశారు. అతనితో పాటు నలుగురు సర్వే సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతామణి మాట్లాడుతూ.. అండర్ గ్రౌండ్ పాసేస్ గానీ,ఫ్లైఓవరు బ్రిడ్జిగానీ అందు కోసమే ఈ సర్వే చేస్తున్నామని చెప్పారు. భివష్యత్తులో ఇక్కడ రైల్వే గేటు ఉండదన్నారు. ఈ రెండింటిలో ఏదైనా గేటు కష్టాలు తీరుతాయని ప్రయాణీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కవిటి: ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల్ని సాధించాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్ ఎ.సుబ్బారావు ఆకాంక్షించారు. కుసుంపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన డోలోత్సవం

కవిటి: బెజ్జిపుట్టుగలోని చక్రధర పెరుమాళ్ల స్వామి డోలోత్సవాలు శనివారంతో వైభవంగా ముగిశాయి. ఈ నెల ఒకటి నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. చివరిరోజున వసంతోత్సవం, చక్రస్నానం ఉత్సవం వైభవోపేతంగా జరిగాయి. ఆలయ అనువంశిక ధర్మకర్తలు పి.కృష్ణారావు, శ్రీరాంబాబు, విజయకృష్ణలచే స్వామివారిని కామదహనోత్సవ వనానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం చక్ర పెరుమాళ్ స్వామి విహార పుష్పవనం నుంచి ఆలయ మాఢవీధులలో తిరువీధులు చేశారు. ఉత్సవాలలో భాగంగా స్వామివారికి ఆభరణాలంకారసేవ, వసంతోత్సవం, చక్రస్నాన ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కానిస్టేబుల్ ఔదార్యం



రక్తదానం చేస్తున్న రాము

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో డయాలసిస్ చేసుకుంటున్న ఓ బాధితురాలికి అత్యవసరంగా రక్తం అవసరమైంది. కుటుంబీకులు పలువురిని సంప్రదించారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ రాము ముందుకు వచ్చారు. బాధితురాలికి అవసరమైన బి-పాజిటివ్ రక్తాన్ని బాధితురాలికి శనివారం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు.

గుడ్డ సంచులు పంపిణీ

కవిటి: పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి లక్ష్యమని.. అందుకు ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డతో తయారు చేసిన చేతి సంచులనే వాడడం అలవాటుచేసుకోవాలని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బెందాళం రమేష్ అన్నారు. ఈ మేరకు కవిటి సచివాలయంలో మహిళలకు చేతి గుడ్డతో చేసిన సంచులను శనివారం పంపిణీ చేశారు. అనంతరం వర్తక, వ్యాపారులకు కవిటి సచివాలయం విస్తరణాధికారి జీవీ స్వామి, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గుడ్డ సంచుల వినియోగంపై అవగాహన కల్పించారు.

విద్యార్థి దశ కీలకం

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ కీలకమని వజ్రపుకొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా అన్నారు. టెన్త్ విద్యార్థుల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పిల్లలకు పరీక్ష కిట్లను ఉపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో మొదలవలస వాసుదేవరావు, కె.రమణ, తమ్మినాన భోజరాజు,"గజేంద్ర, శ్రీను ఉన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళి

కాశీబుగ్గ: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు..దివంగత కాన్షీరాం 91వ జయంతి కార్యక్రమాన్ని దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కాశీబుగ్గలో శనివారం నిర్వహించారు. పలాస నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు పిలక కృష్ణారావు, అధ్యక్షులు తెప్ప పాపారావు, కమిటీ సభ్యుల సమక్షంలో కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పరిరక్షణ సమితి ప్రతినిధులు ఎస్.సంజీవరావు, బోనాల ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

210 లీటర్ల సారాతో ఇద్దరు అరెస్టు

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధి కంచిలి మండలం డొలసాయి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల నుంచి 210 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ కె.బేబి తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'కాలువను కాపాడండి'

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి కోదండరామవీధి సమీపంలో 49-ఆర్ సాగునీటి కాలువ ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గోపినాథపురం ప్రాంతానికి చెందిన రైతులు కోరుతున్నారు. కాలువను ఆనుకుని ఇటీవల రియల్ ఎస్టేట్ వెంచర్ వేస్తుండడంతో దీన్ని కప్పే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే నీటి పారుదల శాఖాధికారులు స్పందించి సాగు నీటి కాలువ ఆక్రమణకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలలకు.. చంద్ర గ్రహణం!

- నిలిచిపోయిన 'నాడు-నేడు' అభివృద్ధి పనులు
- పలాస నియోజకవర్గంలో వెలవెలబోతున్న 206 పాఠశాలలు



నాడు- నేడు మొదటి దశలో సూర్యమణిపురంలో సర్వాంగ సుందరంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల



గోవిందపురం ఉన్నత పాఠశాలలో నిలిచి పోయిన భవన నిర్మాణాలు

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. పాలకులు తీసుకుంటున్న నిర్ణయాలతో సర్కార్ బడులు ఉనికిని కోల్పోయే ప్రమాదం నెలకుంది. చాలా పాఠశాలలు క్రమంగా కుదేలవుతున్నాయి. పలాస నియోజకవర్గంలోని 347 పాఠశాలలకు 206 కళావిహీనంగా ఉన్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఓ వెలుగు వెలిగిన సర్కార్ బడులు ఇప్పుడు గాలిలో దీపంలా ఊగిసలాడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పది నెలలుగా పాఠశాలలను పట్టించుకోకపోవడంతో ఉనికిని కోల్పోయే ప్రమాదం నెలకుంది.

ఆ రోజులు స్వర్ణయుగం..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు ప్రభుత్వ పాఠశాలలు కళను కోల్పోయి ఉండేవి. 2019 తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడడంతో విద్యా వ్యవస్థకు మంచిరోజులు వచ్చాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలతో పాఠశాలలు అద్భుతంగా రూపుదిద్దుకున్నాయి. ప్రధానంగా నాడు-నేడు పథకం ద్వారా సకల సౌకర్యాలు సమకూరాయి. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలను తలదన్నేలా తయారు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆత్మవిశ్వాసం నింపారు. దీంతో సర్కారు స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. కానీ కూటమి సర్కారు రాకతో అదంతా ఓ కలగా ప్రస్తుతం మిగిలిపోయింది. ప్రభుత్వ పాఠశాలలపై మళ్లీ నమ్మకం పోయింది. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

50 శాతం కూడా పూర్తి చేయని కూటమి సర్కారు

మందస మండలంలో 138, పలాస రూరల్‌లో 65, అర్బన్‌లో 54, వజ్రపుకొత్తూరులో 90 పాఠశాలలు ఉన్నాయి. పలాస నియోజకవర్గంలో మొదటి దశ నాడు-నేడులో 206 పనులను రూ.56 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిచేయగా, రెండో దశలో 196 పనులకు గాను రూ. 63 కోట్లు మంజూరు చేయగా రూ.29.56 కోట్లుతో పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు జరుగుతుండగానే 2024 ఏప్రిల్ 18వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో మిగిలిన 50 శాతం పనులకు చంద్ర గ్రహణం పట్టింది. విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు కూడా పూర్తి చేయలేని దుస్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉంది. పూర్తిగా లోకేష్ తన శాఖను గాలికి వదిలేయడంతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో పాఠశాలలో మౌలిక వసతుల లేమి పెరిగిపోగా సమస్యలు తిష్ట వేశాయి.

నమ్మకం పోతోంది..



కూటమి ప్రభుత్వ హయాంలో సర్కార్ బడులపై నమ్మకం పోతుంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ పట్టింది. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరాయి. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టారు. అయితే కూటమి సర్కార్ జగన్ కృషిని గంగలో కలిపింది. పేద విద్యార్థులకు సంక్షేమ పథకాలను ఎగ్గొట్టింది. దీంతో ప్రభుత్వం పాఠశాలలపై నమ్మకం పోయే పరిస్థితి నెలకుంది.

– ఎం.భాస్కరరావు, పల్లివూరు, వజ్రపుకొత్తూరు మండలం

పనులు పూర్తి చేస్తాం

నాడు- నేడు పథకం రెండో దశలో మంజూరైన పనులు దాదాపు 50 శాతం మేర అప్పట్లోనే పూర్తి చేశాం. ఎన్నికల అనంతరం పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం మొండి గోడలతో ఉన్న పనులు పూర్తి చేసేందుకు అప్పట్లో వేసిన ఎస్టిమేషన్లను మళ్లీ ప్రభుత్వానికి పంపించాం. మార్చి నెల తరువాత నిధులు మంజూరవుతాయి. అప్పుడు పనులు మొదలుపెట్టి పూర్తి చేస్తాం. గోవిందపురం, ఇతర పాఠశాలల్లో అర్ధాంతరంగా ఆగిన పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– మోహనరావు, ఏఈ, ఆర్ఎంఎస్ఏ, వజ్రపుకొత్తూరు

సౌభాగ్యలక్ష్మి విగ్రహ ప్రతిష్ట



టెక్కలి పట్టణంలోని అయ్యప్ప ఆలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సౌభాగ్య లక్ష్మి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం సంప్రదాయబద్ధంగా జరిగింది. ముందుగా సౌభాగ్య లక్ష్మి విగ్రహానికి అర్చకు బృందం ప్రాణ ప్రతిష్ట చేయగా అధికసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

–టెక్కలి

మంచినీరు ఇప్పించండి..



కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మౌలిక వసతులు కరువయ్యావని సంతబొమ్మాళి మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు అన్నారు. కనీసం మంచినీటినైనా అందించండి మహాప్రభో అంటూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. వేసవిలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిరసనలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ నక్క చింతామణి, ఎంపీటీసీ సభ్యులు బి.సుధాకర్, ఎస్.రాజారావు, సర్పంచ్‌లు కె.ఇందిర, జోగి రాములమ్మ ఉన్నారు.

– సంతబొమ్మాళి

స్కూటర్‌పై తీర్థయాత్రలు



కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన మాజీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దక్షిణామూర్తి కృష్ణకుమార్ తల్లితో కలిసి స్కూటర్‌పై తీర్థయాత్రలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి ఇచ్ఛాపురం చేరుకున్నారు. 2018 జనవరి 16వ తేదీన మైసూర్‌లో యాత్రను ప్రారంభించి కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్‌లోని దేవాలయాలను దర్శించినట్టు చెప్పారు. తన తల్లి కోరిక మేరకు ఇప్పటివరకు 97 వేల 2 వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి పుణ్యక్షేత్రాలను దర్శించినట్టు తెలిపారు.

ఇచ్ఛాపురం టౌన్

సూపర్ సిక్స్ అమల్లో సర్కార్ విఫలం

- ఎమ్మెల్సీ నర్తు రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు, పక్కన ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల హామీల అమలును కూటమి సర్కార్ గాలికొదిలేసిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సుమారు తొమ్మిది నెలల పాలన పూర్తయినప్పటికీ సూపర్ సిక్స్‌లో ఎన్ని పథకాలను అమలు చేశారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రారంభంలో చేసిన హడావిడి ఇప్పుడు కానరావడం లేదన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఖరీఫ్‌లో పండించిన సుమారు 1.5 లక్షల టన్నుల ధాన్యాన్ని ఇప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయలేదన్నారు. ఈ విషయమై ఇప్పటికే తాను శాసనమండలిలో ప్రస్తావించానని గుర్తుచేశారు. సంబంధిత అధికారులు తర్వాత ఏం చేశారనేది సమాచారం లేదన్నారు. ఉద్యానశాఖ ద్వారా కొబ్బరి, జీడి, మామిడి మొక్కలు ఇస్తున్నామంటూ ప్రకటనలు చేయడం చూస్తున్నామే తప్పా.. క్షేత్రస్థాయిలో ఏం చేస్తున్నారనేది సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులకు తెలియజేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

నీటి సరఫరా ఆపడంపై సర్పంచ్ మండిపాటు..

పెద్దశ్రీరాంపుర పంచాయతీ కేంద్రంలో జలజీవన్‌మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసే ప్రక్రియలో ఇప్పటి వరకు సగం ఇళ్లకు కుళాయిలు ఫిట్‌చేసి, వాటికి చేస్తున్న నీటి సరఫరాను నిలిపి వేయడంపైన స్థానిక సర్పంచ్ బల్లెడ సుమన్ అధికారులపై మండిపడ్డారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహనరావుకు సూచించారు. జాడుపూడి గ్రామ పంచాయతీలో పలువురు గోశాలలను నిర్మించినా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని ఎంపీటీసీ సభ్యురాలు జామి జయ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడు లగ్జరీ బస్సులు ప్రారంభం

కాశీబుగ్గ: పలాస-విశాఖపట్నం-ఇచ్ఛాపురం పట్టణాలకు అనుసంధానంగా నడిచే మూడు లగ్జరీ బస్సులను పలాస ఆర్టీసీ డిపో వద్ద శనివారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష జెండా ఊపి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన

ఇచ్ఛాపురం టౌన్/ఇచ్ఛాపురం రూరల్: ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేటాయించిన కేంద్రాలను ఎంఈవోలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథంలు శనివారం పరిశీలించారు. ఈ ఏడాది మండపల్లి ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రంలోని మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఏపీఎం పురుషోత్తపురంలో ఒకటి, బాలికోన్నత పాఠశాలలో ఒకటి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు, మండపల్లిలో రెండు, డొంకూరు ఉన్నత పాఠశాలలో ఒకటి మొత్తం ఏడు కేంద్రాల్లో 1498 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉందన్నారు.

సర్వసభ్య సమావేశం బహిష్కరణ



ఎంపీడీఓకు తీర్మాన కాపీని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సంతబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ప్రజాప్రతినిధులు బహిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నుంచి స్థానిక సంస్థలైన పంచాయతీ అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేయకుండా సహకరించని మండల పంచాయతీరాజ్, ఇతర అధికారుల తీరుకు నిరసనగా, ఎంపీటీసీల గౌరవ వేతనం చెల్లించని కారణంగా సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తూ ఏకవాక్య తీర్మానాన్ని ఆమోదించారు. ఈ కాపీని స్థానిక ఎంపీడీవో పి.జయంత్‌ప్రసాద్‌కు జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ నక్కచింతామణి తదితరులు అందజేశారు. ప్రజాప్రతినిధులను కూటమి ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని దుయ్యబట్టారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, దీనికి సమాధానం ఎవరు చెప్తారని ప్రశ్నిస్తూ బయటకు వెళ్లిపోయారు. అంతకుముందు కోరం లేక రెండు గంటల ఆలస్యంగా సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఎంఈవోలు చిన్నవాడు, అర్జునుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగించాలి



మాట్లాడుతున్న ఏడీ జగన్మోహనరావు

ఇచ్ఛాపురం రూరల్: రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగేలా సంఘ సభ్యులు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. స్థానిక సెర్ఫ్ కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ, ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి శనివారం జరిగిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ ఇంపుట్స్ తయారు చేసుకునే విధంగా చిన్న సంఘాలను ప్రోత్సాహించాలని అన్నారు. మండల వ్యవసాయాధికారి టి.భార్గవి, సెర్ఫ్ ఏపీఎం సనపల ప్రసాదరావు, శిక్షకులు రమణ, దుర్గా ప్రసాద్, వీఏఏ, వీవోఏలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ దుంపల వైకుంఠరావు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉన్నాయన్నారు. వివరాలకు 91774 58429 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అమ్మవార్ల ఆలయాలనిర్మాణానికి శంకుస్థాపన

కంచిలి: కంచిలిలోని పద్మతుల గ్రామం వద్ద గల చింతామణి అమ్మవారు, మఠం కంచిలి వద్ద గల నిమ్మాసిని అమ్మవారు, మెయిన్‌రోడ్డులోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాలు చాలాకాలంగా ఎటువంటి రక్షణ లేక ఆరు బయటే ఉన్నాయి. ఈ అమ్మవార్లకు నీడ కల్పించే ఉద్దేశంతో చిన్నపాటి గుడులు నిర్మాణానికి స్థానిక కొత్తకోట కుటుంబీకులు ముందుకొచ్చారు. ముందుగా చింతామణి అమ్మవారి ఆలయం వద్ద గుడి నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు.

మృతుని కుటుంబానికి పరిహారం అందజేత

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయం పరిధిలో విద్యుత్ పనులు చేస్తూ బాలరాజు అనే కార్మికుడు కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా టెక్కలి టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మృతుడి భార్య ధనలక్ష్మికి రూ. 50 వేలు పరిహారం అందజేశారు. పంచాయతీ ఈవో జగన్నాథం, నాయకులు బి.శేషగిరి, కె.లవకుమార్, పి.అజయ్‌కుమార్, హెచ్.రామకృష్ణ, ఎం.రాము ఉన్నారు.

వినియోగదారుల హక్కుల వైస్ చైర్మన్‌గా సాహూ

ఇచ్ఛాపురం రూరల్: జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిషన్ జిల్లా వైస్ చైర్మన్‌గా ఎం.తోటూరుకు చెందిన డాక్టర్ సంతోష్ కుమార్ సాహూ నియమించబడ్డారు. ఈ మేరకు శనివారం విశాఖపట్నం వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో వినియోగదారుల హక్కుల కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సాయి రమేష్ నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాహూ మాట్లాడుతూ.. ప్రజల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.

మొక్కలు మాయం!


- సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన వైనం




సామాజిక తనిఖీ ప్రజా వేదికపై అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: పని ప్రదేశంలో ఉండాల్సిన మొక్కలు తమ తనిఖీల్లో ఎక్కడా కానరావడం లేదని, అయితే వాటికి సంబంధించి డబ్బులు చెల్లించినట్టు సామాజిక తనిఖీల్లో వెల్లడైందని డీఆర్పీలు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 21 పంచాయతీల్లో చేసిన ఉపాధి హామీ పథకం పనులపై గత నెల రెండు నుంచి 16వ తేదీ వరకు నిర్వహించిన సామాజిక తనిఖీలకు సంబంధించిన విషయాలను శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన ప్రజావేదికలో వెల్లడించారు. మండలంలో సుమారు రెండు వేలకు పైగా మొక్కలు నాటితే కనీసం రెండు వందలు కూడా లేకుండా పోయాయని స్పష్టం చేశారు. 15 రోజుల్లో మొక్కలు నాటాలని, లేకుంటే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయడం జరుగుతుందన్నారు. చాలా ప్రాంతాల్లో బినామీ మస్టర్లు వేశారని, మస్టర్లలో దిద్దుబాట్లు ఉన్నట్లు కనుగొన్నామని డీఆర్పీలు చెప్పారు. ముచ్చింద్ర, కీర్తిపురం పంచాయతీల్లో సీసీ రోడ్లను లైవ్‌లో ఉంచేందుకు మస్టర్లలో పని ప్రారంభించినట్లు నగదు చెల్లింపులు జరిగాయని, అయితే వాస్తవానికి అక్కడ ఎటువంటి రోడ్లు లేవని పేర్కొన్నారు. 1248 పనులకు పద్నాలుగున్నర కోట్ల రూపాయలకు ఆడిట్ నిర్వహించారు. కొఠారీ పంచాయతీకి సంబంధించి సామాజిక తనిఖీలో విషయాలను డీఆర్పీ జె.నర్సింహమూర్తి వెల్లడిస్తున్నప్పుడు ఏఎంసీ మాజీ చైర్మన్, కూటమి నాయకుడు సాడి సహదదేవ్‌రెడ్డి సామాజిక తనిఖీ బృందంపై శివాలెత్తారు. తన పంచాయతీలో తాను చెప్పినట్లు డీఆర్పీ నడుచుకోలేదని, సుమారు రూ.30 వేల వరకు అక్రమాలు జరిగాయని, పనులకు వెళ్లకుండా ఫీల్డ్ అసిస్టెంట్ హాజరు వేసి అక్రమాలకు పాల్పనట్టు ఆరోపించారు. సహదేవ్‌రెడ్డి ఆరోపణలపై స్పందించిన ఏపీడీ కె.లోకేశ్వరరావు మాట్లాడుతూ.. కొఠారీ అంశంపై ఏపీడీతో విచారణ చేయనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, విజిలెన్స్ డీవీవో స్వరూపారాణి, ఎస్ఆర్పీ ఎం.తిరుపతిరావు, హెచ్ఆర్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఎంపీడీవో కె.రామారావు, ఏపీవో పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం



టెక్కలి: ఆర్డీవో కార్యాలయం ఆవరణను పరిశుభ్రం చేస్తున్న ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, సిబ్బంది



సంతబొమ్మాళి: నౌపడ పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలను నాటుతున్న డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ




ఇచ్ఛాపురం: ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు

పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, వివిధ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రుల పరిసరాలను శనివారం పరిశుభ్రం చేశారు. చెత్త..చెదారాలను తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ర్యాలీలు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటారు. ప్లాస్టిక్ వినియోగంతో చేకూరనున్న నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్

జీడిపిక్కల బస్తాకు రూ.16వేలు చెల్లించాలి



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న జీడి రైతు సంఘం నాయకులు

పలాస : జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, 80 కిలోల బస్తాకు రూ.16వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ జీడి రైతు సంఘం పలాస శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పలాస వచ్చిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషాకు వినపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర జాబితాలో జీడి పంటను చేర్చాలన్నారు. జీడి కార్పోరేషన్, జీడి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి పంట విస్తీర్ణం పెంపునకు కృషి చేయాలని కోరారు. నాణ్యమైన జీడి మొక్కలను అందజేయాలని, జీడి అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, ప్రతినిధులు ఎస్.గణపతి, కోనేరు రమేష్, మద్దు రాఘవరావు, మద్దిల రామారావు, కోనేరు ఆదినారాయణ, కొండప్ప సురేఖ, బత్తిన లక్ష్మీనారాయణ, గేదెల నీలకంఠం, మల్లేన జీవనరావు, బొడ్డు విజయ్, ఎంపల్ల జోగారావు తదితరులు పాల్గొన్నారు.